## నీ చిరు నవ్వుకోసం....!

స్వాతి!

బాగున్నావా? ఎన్నాళ్ళయ్యింది నిన్ను చూసి! చాలా దూరంలో ఉన్నాను. అదీగాక రావాలంటే వీలుపడదు.



కాలేజ్‌లో చదువుతున్నావని తెలిసింది. కంగ్రాచ్యులేషన్స్. నీ ప్రేమలో పడ్డాకే నాకు ఈ లోకమంటే ఏమిటో తెలిసిపోయింది. నిన్ను చూశాక చాలా నేర్చుకున్నాను నేస్తం! మనస్ఫూర్తిగా నిన్ను ప్రేమిస్తున్నా కనీసం నీవు సమయస్ఫూర్తి కోసమయినా నాకు అగుపించక పోవటం చాలా విచారకరం కాదా మరి!

అవునూ మనిద్దరికీ పెళ్ళీడు వచ్చింది కదా. అటు మీ అమ్మానాన్నలు, ఇటు మా అమ్మానాన్నలు మన పెళ్ళి గూర్చి ఎలాంటి వత్తిడి తేవటం లేదంటే ఆశ్చర్యమే మరి!! ఇన్నాళ్ళ మన ప్రేమ విరహంలో నీకు నేను, నాకు నీవు ఎన్నెన్నో మార్లు గుర్తుకొచ్చి ఉంటాం కదా. కానీ ఒక్క ఉత్తరం ముక్కయినా వ్రాసుకున్నామా. అవును ఉత్తరం అంటే గుర్తొచ్చింది. మన స్నేహం ఉత్తరం ద్వారానే కదా పరిచయమయ్యింది. మరి చానేమో. సారీ స్వాతి. నేను ఇప్పట్లో రాలేను కానీ నీకు నా మీద ఉన్న అభిమానానికి గుర్తుగా నేను అక్కడకొస్తే కనీసం నవ్వుతూ అగుపిస్తావామ్మ. ఈ నా లేఖ చదవగానే నీ మోమంతా చంద్రబింబంలా వెలిగిపోతుందని తెలుసు. మనల్ని చాన్నాల్ల తరువాత కలిపిన 'మయూరి'కి థాంక్స్ చెబుతూ...

నేను చెప్పింది గుర్తుంది కదూ...!

నీ మోములో స్వాతి ఝల్లుని చూడాలన్న ఆశతో

నీ ప్రియనేస్తం

ఎం.వి.హెచ్. బాబు (భీవండి)

# దూరపు కొండలు

**మినీ కథ**

ఆరు బయట ప్రకృతి చల్లగా ఉంది. కిటికీలోంచి పిల్లగాలులు నా శరీరాన్ని పులకరింపజేస్తున్నాయి. హృదయం ఆనందంతో తియ్యని రాగాలాలపిస్తుంది. ఎవరో హృదిని మీటినట్లు సప్త స్వరాలు ఒక్కసారి శ్రావ్యంగా వినిపిస్తున్నట్లు ఫీలింగ్ నాలో కలుగుతూ ఉంది. ఇలా ఆకాశంలో విహంగంలా పయనించే నా మనస్సు వీధి గుమ్మం దగ్గర చప్పుడయ్యే సరికి ఈ లోకంలోకి వచ్చిపడింది.

అప్పుడే పుట్టిన లేత గులాబీలా చూడగానే ఎంత అందం అనిపించే ఆ మోము. పంజాబీ డ్రస్‌లో ఎంతటి వారినైనా ఇట్టే ఆకట్టుకోగల సౌందర్యం ఆమెది.

ఆ క్షణాన నా మనస్సు ఉద్వేగంతో ఊగిపోతూ ఆమె రాకతో కలిగిన ఫీలింగ్‌లకు ఎలా తట్టుకోవాలో తెలియక క్షణంపాటు ఉక్కిరిబిక్కిరి అయ్యాను. ఆమె నాకోసం అదీను నా గదికి సరాసరి వచ్చేసినందుకు నా మనస్సు పరిపరి విధాలా ఆలోచిస్తుంది. అన్ని రోజులు సాన్నిహిత్యంలో లేని స్పందన ఈ రోజే ఎందుకు కలుగుతుంది!?

ఆహ్వానించినప్పుడు లేని తొట్రుపాటు ఎందుకు ఇప్పుడు కలగాలి. నా మనస్సుతో నేను మాట్లాడుకుంటూ ఉండగానే...

"ఏమండీ శ్రీనుగారూ! ఏంటీ చూపేమో నామీదే ఉంది. మనసెక్కడో చిక్కుకుపోయింది. ఏమిటి విషయం?" పక్కకు పడిన కురులను సవరించుకుంటూ అన్నది.

హృదయాన్ని ఎవరో శృతి చేసినట్లు... తియ్యని రాగంలా ఆ మాటలు వినిపించేసరికి ఎక్కడో పారవశ్యం కలిగింది నాలో.

"రా సుశీలా! అలా కుర్చీలో కూర్చో నీ గురించే ఆలోచిస్తూ నీ రాక ఎలా ఉంటుందో ఊహించుకుంటూ నువ్వొచ్చావన్న సంగతే పట్టించుకోలేదు. ఐయామ్ సారీ!" అన్నాను.

"ఆ! దానికేముందిలే. నేనొక ముఖ్య విషయం మాట్లాడడానికి వచ్చాను" అటూ చూస్తూ అంది.

"నువ్వొచ్చేదేముంది. నేనే రమ్మన్నానుగా. అందుకే ఉదయం నుండి నువ్వొస్తావని బయటకు కూడా వెళ్ళలేదు." అన్నాను చిరుకోపంతో.

" ఆ విషయం వదిలిపెట్టు. నా పెళ్ళి గురించి నేనొక ఖచ్చితమైన నిర్ణయానికొచ్చేశాను. జీవితంలో ఎదుర్కోబోయే సమస్యలతో పాటు సుఖ సంతోషాలు ఇప్పుడు తీసుకోబోయే ఒక్క నిర్ణయంపై ఆధారపడి ఉంటాయి.

ప్రేమికులుగా ఎంతకాలం కలిసి ఉన్నా ఎంత పర్దుకుపోయినా ఒకరి మనస్సును ఒకరు ఎంత బాగా అర్థం చేసుకున్నా భవిష్యత్తును అందంగా చిత్రీకరించుకున్నా పెళ్ళైన తర్వాత ఎవరి దారి వారిదౌతుంది. ఒకరిని విడిచి మరొకరు బ్రతకాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.

ప్రేమించుకునే సమయంలో సంసారం ఎంత అందంగా కనిపించినా పెళ్ళైయ్యాక అదో కష్టాల కడలిలా అవుతుంది." ఉపన్యాస ధోరణిలో చెప్పుకుపోతున్న సుశి మాటలను విని అచేతనంగా బెల్లం కొట్టిన రాయిలా ఉండిపోయాను.

నా సుశినేనా ఇలా మాట్లాడేది. ఎంత చక్కగా ఒక సమస్యను ఆలోచిస్తుంది. ఆమెలో ఇంత ట్యాలెంట్ ఉన్నదని ఇంతవరకు మచ్చుకునకైనా ఏనాడు గ్రహించలేదు.

"ఏమిటో ఆలోచిస్తున్నారు" అన్న సుశి మాటలకు నా ఆలోచనను ప్రక్కన పెట్టాను.

కొంత సేపు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది. ఆ నిశ్శబ్దాన్ని తరిమికొడుతూ.

"నువ్వు ఎంత చక్కగా ఆలోచిస్తావు సుశీ. సమస్యలను అన్ని కోణాలనుంచి చూస్తావు."

"అలా ఆలోచించగలను కాబట్టే జీవిత తత్వం అంటే ఏమిటో తెలుసుకున్నాను. నీవు డిగ్రీ పాసయ్యావు బాగానే ఉంది. మంచి ఉద్యోగం వచ్చేవరకు తల్లిదండ్రులు పంపే డబ్బు మీదే ఆధారపడి బ్రతుకుతున్నావు. చిన్న ఉద్యోగాలంటే నాకు గిట్టవు. ఉద్యోగం వస్తొంది. దాంతో హాయిగా జీవించొచ్చు అనుకుంటూ కాలాన్ని దొర్లిస్తున్నావు.

ఇలాంటి వాడివి రేపు నన్నెలా పోషిస్తావు. అందుకే రికార్డు అసిస్టెంట్‌గా జాబ్ చేస్తున్న మా దూరపు బంధువును పెళ్ళి చేసుకోబోతున్నా. వాళ్ళాఫీసులో నాకూ ఓ ఉద్యోగం కొరకు ప్రయత్నం చేస్తానన్నాడు. ఇదిగో మా పెళ్ళి శుభలేఖ. నీవు తప్పక రావాలి. ఇక వస్తాను" అంటూ వెళ్ళిపోయింది.

ఆమె రాక ఎంత ఆనందాన్ని కలిగించిందో ఆమె వెళ్ళిపోతుంటే అంత బాధ నాలో కలిగింది.

దూరపుకొండలు నునుపు కావని చాలా ఆలస్యంగా గ్రహించాను.

వెన్నెల...